క్లుప్తంగా

బొడ్రాయి వేడుకల్లో ఎమ్మెల్యే గండ్ర



టేకుమట్ల: మండలంలోని బండపల్లిలో కొనసాగుతున్న శ్రీలక్ష్మీ–భూలక్ష్మీ, బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకల్లో బుధవారం ఎమ్మెల్యే గండ్ర వెంటకమణారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొడ్రాయి ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే గండ్రను సర్పంచ్ నామని రాజేందర్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయన వెంట జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేటినుంచి కోటంచ బ్రహ్మోత్సవాలు

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని కోటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం నుంచి ఈ నెల 9వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని బుధవారం ఈఓ బిల్ల శ్రీనివాస్, చైర్మన్ మాదాడి అనితకరుణాకర్‌రెడ్డి తెలిపారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

మహదేవపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం సైబర్ నేరాలపై ఎస్సై భవానిసేన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీ చెప్పవద్దని, మోసపూరిత సందేశం నమ్మి గుర్తుతెలియని వ్యక్తులకు ఆధార్, బ్యాంకు, వివరాలు తెలియజేయద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 కి కాల్ చేయాలని సూచించారు.కార్యక్రమంలో పోలీసులు, పాఠశాల హెచ్ఎం ఆకుల అశోక్, ఉపాధ్యాయులు, సీఆర్పీఎఫ్ పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



టేకుమట్ల(రేగొండ): రేగొండ మండల కేంద్రంలోని వాణి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయంపాలనా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. జిల్లా విద్యాధికారిగా గాజర్ల హర్షిత్, డిప్యూటీ డీఈఓగా సమ్రీన్, ప్రధానోపాధ్యాయులుగా సుశాంత్ వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రజినికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిట్యాల: విద్యార్థులచే స్వయం పరిపాలన దినోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎంగా నాగరాణి, ఎంఈఓగా నోముల భూమిక, నోముల సాత్వికలు వ్యవహరించారు. ప్రధానోపాధ్యాయులు గోవిందా సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులుగా పనిచేసి తమ ప్రతిభను కనబరచడం శుభ సూచికమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భగవాన్ రెడ్డి, శ్రీలత, నీల తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



మహముత్తారం: తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 13 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను తహసీల్దార్ మాధవి బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సందీప్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, కల్యాణలక్ష్మి లబ్ధిదారులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును పశువైద్యాధికారి మల్లేష్ ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. గ్రామంలోని గొర్రెలు 80, మేకలు 420లకు నట్టలనివారణ మందు పంపిణీ చేసినట్లు తెలిపారు. అటెండర్ లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను గద్దె దింపడమే ధ్యేయం

మొగుళ్లపల్లి: ప్రజాగోస బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ బుధవారం మండలంలోని పెద్ద కోమటిపల్లి, ఇప్పలపల్లి గ్రామాలలో మండల అధ్యక్షుడు చెవ్వ శేషగిరి ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్‌లు కేతుపల్లి తిరుపతిరెడ్డి, దొంగల రాజయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పార్లమెంటు కోకన్వీనర్ చాడ రఘుపతిరెడ్డి, నాయకుడు చందుపట్ల సత్యపాల్ రెడ్డి హాజరై మాట్లాడారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చదువు రామచంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి అన్నం శ్రీనివాస్, మధు, రవి, రమేష్, రమణారెడ్డి, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

దాడి చేయడం హేయమైన చర్య



టేకుమట్ల : సమావేశంలో మాట్లాడుతున్న గండ్ర సత్యనారాయణరావు

టేకుమట్ల: బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నాయకులపై మంగళవారం రాత్రి దాడి చేయడం హేయమైన చర్య అని భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. పార్టీకి నియోజకవర్గంలో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక దాడులు చేయడం సరైంది కాదన్నారు. రానున్న రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని హితవు పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్, యూత్ మండల అధ్యక్షుడు బండ శ్రీకాంత్, నాంపెల్లి వీరేశం, మోతె రాజమౌళి, తోడేటి కుమార్, పొన్నం సాంబయ్య, శాస్త్రాల కిరణ్, దాసారపు సదానందం పాల్గొన్నారు.

ప్రజాధరణ చూసి ఓర్వలేకే దాడులు

చిట్యాల: టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్రకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణకు తట్టుకోలేక జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్నర్ సమావేశంపై బీఆర్ఎస్ గుండాలు దాడి చేశారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రానున్న రోజుల్లో ఓడిపోతామన్న భయంతో రేవంత్ రెడ్డి సభను భగ్నం చేయాలని స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి చెపిన ప్రకారం చిల్లర నాయకులు, గుండాలతో సభలో అల్లరి చేసే ప్రయత్నం చేశారని అన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు కృష్ణ, మూల శంకర్‌గౌడ్, ఎంపీటీసీ అనిల్, శ్రీనివాస్, రాయకొము రు, కిష్టయ్య, రవీందర్, రవీందర్, సాంబశివుడు, భద్రయ్య, కుమార్, భగవాన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



చిట్యాల : మాట్లాడుతున్న తిరుపతి

ఎమ్మెల్యేను విమర్శిస్తే ఊరుకునేది లేదు



సమావేశంలో మాట్లాడుతున్న సట్ల రవిగౌడ్

టేకుమట్ల : ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని విమర్శిస్తే ఊరుకునేది లేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సట్ల రవిగౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో ప్రజలకు ఉపయోగపడే పనులు చేసి, ప్రజల మెప్పును పొందే నాయకులే చరిత్రకారులుగా మిగిలిపోతారన్నారు.మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సంగి రవి, రామారావు, మహిపాల్‌రెడ్డి, స్వామిరావు, శ్రీను, మహేష్, మహేందర్, పాల్గొన్నారు.

న్యాయం చేయకపోతే ఆందోళన చేస్తాం



ఇసుక కుప్పలు పోసి నిల్వఉంచిన పంట భూములు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం పరిధిలోని పూసుకుపల్లి శివారులో ఓ కాంట్రాక్టర్ పంట భూముల్లో ఇసుక కుప్పలు పోసుకునేందుకు పంట భూములు లీజుకు తీసుకొని పోశాడు. రైతులకు (లీజు)కౌలు డబ్బులు ఇవ్వక రెండేళ్లుగా తప్పించుకు తిరుగుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే..పూసుకుపల్లి పార్టు–2 క్వారీకి సుమారు 30 ఎకరాల పంట భూమిని రైతులు కౌలుకు ఇచ్చారు. ఎకరానికి రూ.60వేల చొప్పున కౌలుకు సదరు కాంట్రాక్టర్ తీసుకొన్నాడు. కానీ రెండేళ్లుగా క్వారీ అంతంత మాత్రంగానే నడుస్తుంది. దీంతో రైతులు తమ భూముల్లో నిల్వ ఉంచిన ఇసుక కుప్పలు ఖాళీ చేస్తే పంట వేసుకుంటామని, లేదా ఇతరులకు సాగు చేసేందుకు కౌలుకు ఇచ్చేందుకు అవకాశం ఉందని మొరపెట్టుకున్నారు. ఇటు టీఎస్ఎండీసీ పీఓ చుట్టూ తిరిగినా పొంతన లేని సమాధానాలు చెబుతూ దాటవేస్తున్నారని అరుణ్ వాపోయాడు. తమకు న్యాయం చేయకపోతే పీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేయడానికి సిద్ధంగా ఉన్నామని తేల్చి చెప్పారు.

ప్రీతి మృతి బాధాకరం



భూపాలపల్లి రూరల్ : రక్షిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గండ్ర దంపతులు

భూపాలపల్లి రూరల్ : ర్యాగింగ్ భూతం కారణంగా మృత్యువుతో పోరాడి మరణించిన డాక్టర్ ధరావత్ ప్రీతి మృతి చాలా బాధాకరమని, దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి జ్యోతి దంపతులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ప్రీతి చిత్రపటానికి ఎమ్మెల్యే దంపతులు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. అనంతరం మనోవేదనకు గురై ఉరివేసుకొని మృతి చెందిన రక్షిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే దంపతులు పరామర్శించారు. మునిసిపాలిటీ 24వ వార్డు పార్టీ ప్రధాన కార్యదర్శి ఎండీ షాబీర్ అనారోగ్యంతో బాధపడుతుండగా వారి ఇంటికివెళ్లి పరామర్శించారు.

ప్రీతి మృతికి సంతాపంగా కొవ్వొత్తుల ర్యాలీ

కాటారం : వైద్య విద్యార్థిని ప్రీతి మృతికి సంతాపంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ చౌక్ వద్ద ప్రీతి చిత్రపటానికి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. బీఆర్ఎస్ మహిళా విభాగం సబ్ డివిజన్ అధ్యక్షురాలు రత్న సౌజన్యరెడ్డి మాట్లాడుతూ మెడికో విద్యార్థి ప్రీతి ఆత్మహత్య చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మండల లక్ష్మారెడ్డి, సోషల్ మీడియా మండల ఇన్‌చార్జ్ వంగల రాజేందర్‌చారి, పంతకాని సద్వలి, రజనీకాంత్, యువత పాల్గొన్నారు.

సమ్మయ్యనాయక్‌కు డాక్టరేట్



సమ్మయ్య నాయక్

భూపాలపల్లి రూరల్: చిట్యాల మండలం గిద్దముత్తారం గ్రామానికి చెందిన శీలోతు సమ్మయ్యనాయక్ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్శిటీ హైద్రాబాద్ (జేఎన్‌టీయూ)లో కంప్యూటర్ సైన్స్‌అండ్ ఇంజనీరింగ్ విభాగంలో గౌరవ డాక్టరేట్ పీహెచ్‌డీ పట్టా పొందాడు. సమ్మయ్య 1 వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పరకాలలోని శ్రీచైతన్య మోడల్ స్కూల్లో చదివాడు. ఇంటర్మీడియట్ హన్మకొండలోని ఎస్ఎస్ కళాశాలలో, బీటెక్ కాయతీయ యూనివర్శిటీలో పూర్తి చేశాడు. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్శిటీల్లో ఎంటెక్ పూర్తి చేసి అదే యూనివర్శిటీలో ప్రొఫెసర్ డాక్టర్ గోపాల్ ఆధ్వర్యంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరు విభాగంలో పరిశోధన చేశారు. బుధవారం ప్రొఫెసర్ గోపాల్ చేతులమీదుగా పీహెచ్‌డీ పట్టా పొందారు. భూపాలపల్లి మునిసిపల్ కౌన్సిలర్లు పానుగంటి హారిక, బానోత్ రజిత, సమ్మయ్య నాయక్ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

వేడుకలకు నిధులు కేటాయించాలి



ఆజాంనగర్‌లో సంకీర్తనలో పాల్గొన్న హనుమాన్ స్వాములు

భూపాలపల్లి రూరల్: గ్రామాల్లో నిర్వహించే శ్రీరామనవమి వేడుకలకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని, తెలంగాణ రాష్ట్ర హనుమాన్ ప్రచారకులు రాములస్వామి కోరారు. మండలంలోని ఆజాంనగర్‌లో బుధవారం హనుమాన్ స్వాములతో సంకీర్తనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆనాడు తండ్రి మాటకై ధర్మాన్ని కాపాడటం కోసం 14 ఏళ్ల అరణ్యవాసంలో భాగంగా శ్రీరాముడు భారతదేశమంతా చుట్టిరావడం జరిగిందన్నారు. అయోధ్యలో శ్రీరామమందిరాన్ని నిర్మించిన కేంద్ర ప్రభుత్వం, శ్రీరామనవమి రోజున ప్రతి గ్రామంలో జరిగే వేడుకల్లో సీతారాములకు పట్టువస్త్రాలు, తలంబ్రాల ఖర్చుల కోసం నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో హనుమాన్ స్వాములు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ ద్వారా నీటిని విడుదల చేయాలి



మాట్లాడుతున్న రైతులు

చిట్యాల: ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు డీబీఎం 38 ద్వారా ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలని మండలకేంద్రానికి చెందిన రైతులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్ర శివారులో డీబీఎం–38 కెనాల్ వద్ద నీటిని విడుదల చేయాలని రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్‌లో నీటి వినియోగం తక్కువ ఉందన్నారు. సాగు చేస్తున్న మొక్కజొన్న మిరప పంటలు ఎండిపోతు న్నాయన్నారు. స్థానిక ఎమ్మెల్యే, అధికారులు స్పందించి ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు ఎస్సారెస్పీ డీబీఎం 38 కాలువల ద్వారా నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పిట్టల రమేష్, సాదుల రవీందర్, అల్లం రవీందర్, ఈగ రాములు, రాయకొమురు, భద్రయ్య, దిలీప్, పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు క్రీడాపోటీలు ప్రారంభం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఫైనాన్స్ మేనేజర్

భూపాలపల్లి అర్బన్: అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జీఎం కార్యాలయ మహిళా ఉద్యోగులకు నిర్వహించిన క్రీడాపోటీలను ఫైనాన్స్ మేనేజర్ సురేఖ ప్రారంభించారు. స్థానిక మైన్స్, రెస్క్యూ స్టేషన్ ఆవరణలో నిర్వహించగా ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. కార్యక్రమంలో అధికార ప్రతినిధి తుకారాం, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, సేవా కోఆర్డినేటర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం



కాటారం : శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్



మహాముత్తారంలో..

కాటారం: మండలంలోని చిద్నెపల్లిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం సర్పంచ్ రాజమౌళి ప్రారంభించారు. గ్రామపంచాయితీ పరిధిలోని ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. వైద్యురాలు మౌనిక, పంచాయతీ కార్యదర్శి దేవేందర్, మాజీ సర్పంచ్ ఊర వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జీలపల్లిలో కంటివెలుగు

మహాముత్తారం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కొడపర్తి మల్లిక అన్నారు. బుధవారం మండలంలోని జీలపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కంటివెలుగును సర్పంచ్ కొడపర్తి మల్లిక ప్రారంభించారు. కార్యక్రమంలో 128 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.78 మందికి అద్దాలు పంపిణీ చేసినట్లు డాక్టర్ సువర్ణ తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటీసీ కోడి ఆర్జున్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అగ్గితెగులుపై అప్రమత్తత అవసరం



వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాస్

టేకుమట్ల: వరి పంటలో అగ్గితెగులుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కలికోట శివారులో వరి పంటలను పరిశీలించారు. వరి పంటలో అగ్గి తెగులును గుర్తించి రైతులకు నివారణపై పలు సలహాలు, సూచలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొలం గట్లపై గడ్డి లేకుండా చూసుకుని, చిరుపొట్ట దశలో ఉన్న వరి పంటలో ఆఖరిదఫా నత్రజని వాడకం కొన్ని రోజులపాటు నిలిపి వేయాలన్నారు. అలాగే మొక్కలలో రోగ నిరోధక శక్తిని పెంపొందించడానికి మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎకరాకు 13 కిలోలు ఆఖరి దఫాగా వేయాలన్నారు. అగ్గితెగులు నివారణకు ఐసోప్రొథయోలేన్, కాసుగామైసిన్, ట్రైసైక్లోపోజల్, మాంకోజెబ్‌ను తగు మోతాదులో పిచికారి చేయాలన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకర్‌నాయక్

మహదేవపూర్: నాటిన మొక్కలను సంరక్షించాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ సూచించారు. మండలంలోని కుదురుపల్లి, ఎడపల్లి గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నర్సరీ టార్గెట్ మేరకు 100 శాతం మొక్కలు పెంచే విధంగా గ్రామపంచాయతీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.ప్రస్తుతం ఎండలు తీవ్రమవుతున్నందున మొక్కలపై షెడ్‌నెట్ ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి ఇందిర, ఏపీఓ రమేష్, వన సేవక్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



హారిక కుటుంబాన్ని పరామర్శిస్తున్న పుట్ట మధు

మల్హర్ : మండలంలోని వల్లెకుంటకు చెందిన హారిక, శేఖర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు బుధవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట కాళేశ్వర దేవస్థాన చైర్మన్ లింగంపల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు తాజొద్దీన్, మండల మహిళ అధ్యక్షురాలు పంతకాని చంద్రకళ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సిద్ది లింగమూర్తి, మండల కోఆప్షన్ సభ్యుడు అయూబ్‌ఖాన్, మండల నాయకులు యాదగిరిరావు, సమ్మయ్య, ఉపసర్పంచ్ శ్రీశైలం, మండల సోషల్ మీడియా ఇన్‌చార్జి సుమన్ ఉన్నారు.

ఏఎన్ఎం కుటుంబానికి ఆర్థికసాయం



కాటారం : ఆర్థికసాయం అందజేస్తున్న ప్రిన్సిపాల్

కాటారం: స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో గత ఆరేళ్లుగా ఏఎన్ఎంగా విధులు నిర్వర్తిస్తూ గుండెపోటుతో మృతి చెందిన ఏఎన్ఎం కుటుంబానికి కళాశాల, పాఠశాల ఉపాధ్యాయులు చేయూతను అందించారు. ఉపాధ్యాయ బృందం రూ.10 వేల నగదును బుధవారం పావని భర్త సర్దార్‌సింగ్‌కు అందజేశారు. పరామర్శించిన వారిలో ప్రిన్సిపాల్ హరిగొప్పుల రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్ సిరిసిల్ల శ్రీనివాస్, ట్రైట, గ్లాట నాయకులు, కళాశాల ఉపాధ్యాయ కమిటీ నాయకులు శ్రీలత, రాకేశ్, హరిభూషన్, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మల్హర్: మండలంలోని వల్లెకుంటకు చెందిన శేఖర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు బుధవారం పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం వారి కుటుంబానికి శ్రీగాయత్రి విశ్వబ్రాహ్మణ సంఘం తరుపున రూ.2300 ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో సంఘం మండల అధ్యక్షుడు దెంచనాల తిరుపతి, గ్రామశాఖ అధ్యక్షుడు నగునూరి రాజరాం, ఓడెల సమ్మయ్య, బ్రహ్మచారి, సదాశివ్, కృష్ణమూర్తి, రంగు రమేష్ ఉన్నారు.

బస్సుసౌకర్యం కల్పించాలి



డీఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మల్హర్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని తాడిచర్ల–పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లి మానేరుమీదుగా తాడిచర్లకు ఆర్టీసీ బస్సు సౌకర్యం నడిపించాలని మంథని డిపో మేనేజర్ శ్రీనివాస్‌కు కాంగ్రెస్ యూత్ నాయకులు బబ్బిలి రాజు, ఆర్ని ఉదయ్ బుధవారం వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం కొయ్యూరు నాగులమ్మ మీదుగా తాడిచర్ల వస్తుందని చెప్పారు. నూతనంగా ఏర్పాటైన వంతెన మీదుగా బస్సు నడపడంతో భారం తగ్గి ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ప్రజల అభిప్రాయం మేరకు వంతెన మీదుగా బస్సు నడపాలని కోరారు.

‘రేవంత్‌రెడ్డిపై దాడి చేయడం సిగ్గుచేటు’

మొగుళ్లపల్లి: వీధి రౌడీల్లా బీఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తుంటే అధికార పార్టీకి తొత్తులుగా పోలీసులు మారారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి సుదర్శన్ గౌడ్ ధ్వజమెత్తారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ టౌన్ అధ్యక్షుడు క్యాతరాజు రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూపాలపల్లి పట్టణంలో హాథ్ సే హాథ్ జోడో యాత్రలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అనుచరులు దాడులు చేయడం సిగ్గుచేటు అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మల్సాని రాజేశ్వర్‌రావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఓనపాకల ప్రసాద్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, కుమారస్వామి, పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

చిట్యాల: మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి (సి) శివారులోని ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తగిలి బుధవారం మేక మృతి చెందింది. గ్రామానికి చెందిన చిలుకల కొంరయ్య యాదవ్ మేకలను మేత కోసం గ్రామ శివారులోకి తీసుకెళ్లగా ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి అక్కడికక్కడే మృతి చెంది న ట్లు బాధితుడు తెలిపాడు. అధికారులు నష్టపరిహారం ఇప్పించాలని వేడుకున్నాడు.

దామెరకుంటలో భజన కార్యక్రమం



ఆలయంలో నాథ సప్తాహం నిర్వహిస్తున్న భజన భక్తులు

కాటారం: మండలంలోని దామెరకుంటలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో కట్టా శ్రీనివాస్–విమల దంపతుల ఆధ్వర్యంలో బుధవారం నాథ సప్తాహం (భజన కార్యక్రమం) నిర్వహించారు. ఈ నెల 8 వరకు వారం పాటు ఆలయంలో జరుపనున్నట్లు ఆలయభక్త బృందం, నిర్వాహకులు తెలిపారు. 8న అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు, భజనా బృందం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాయితపు విఠల్, రమేశ్‌చారి, భక్తులు పాల్గొన్నారు.